క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన

మధిర: నేత్రదానం చేయడం వల్ల పలువురికి కంటి చూపు ప్రసాదించవచ్చునని ఐ బాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు మాధవరపు నాగేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానం, అవయవ, చర్మ, కేశ దానాల గురించి అవగాహన కల్పించి.. కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ ఆన్‌లైన్ మినహాయించండి

సత్తుపల్లిరూరల్: అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) ఆన్‌లైన్ సేవలు నుంచి ఏఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్‌కు ఏఎన్‌ఎంలు శనివారం వినతిపత్రం అందించారు. ఆరోగ్య సేవల ఆన్‌లైన్, మాతశిశు సంరక్షణ సేవల్లో ఉన్నందున ఎన్‌సీడీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఎం.కామేశ్వరి, నాగమణి, పద్మావతి, మంజుల, సునీత, సుమతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణలో విఫలం

సత్తుపల్లిటౌన్: దేశంలో మహిళలు హత్యలు, అత్యాచారాలు, హింసా, శ్రమదోపిడీకి గురవుతున్నప్పటికీ మహిళా హక్కులను పరిరక్షించటంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని ఐద్వా పట్టణ కార్యదర్శి చెరుకు రత్నకుమారి అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన మహిళా సంఘం(ఐద్వా) సమావేశంలో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాలు పాకలపాటి ఝాన్సీ, పుష్పవల్లి, ప్రభావతి, కుమారి, రజిని, భస్వమ్మ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులివ్వండి

ఎర్రుపాలెం: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షులు పోనుకుల సుధాకర్, మద్దాల ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్ ఎదుట విద్యార్థులతో కలిసి విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందిచారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇమ్మాక్యులేట్‌లో ఘనంగా ఫౌండర్స్ డే

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో శనివారం ఫౌండర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్స్ ఆఫ్ మేరీ ఇమ్మాక్యులేట్ సంస్థ వ్యవస్థాపకుడు బిషప్ మోరో 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మీనా, హెచ్ఎం సిస్టర్ యమున, తదితరులు మోరో చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టర్ బెనెట్, ప్రతిభ, జసింత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో.. సాం'భయ్యా'



అడవిలో మొక్క నాటుతున్న సాంబయ్య, తదితరులు (ఫైల్)

- నిరుపేదయినా దాన ధర్మాల్లో మిన్న
- ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ.. సాటివారికి సాయంగా..

ఏన్కూరు: పదిమందికి సాయం చేయాలంటే ధనవంతుడు కావాల్సిన అవసరం లేదు. ఉన్నదాంట్లో సాయం చేస్తే నిరుపేద అయిన ధనవంతుడితో సమానం. తన సంపాదనలో సాటివారి కష్టాలు తీర్చేందుకు తనకు తోచిన సాయం చేస్తున్నాడు సాంబయ్య. సాయం చేయడంలో ఆయనకు సాటిలేరు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ..

ఏన్కూరు మండల కేంద్రంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ.. నెలకు రూ.5వేలు సంపాదిస్తు సాటివారికి సాయం చేస్తున్నాడు సాంబయ్య. గత 15 సంవత్సరాలు పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాడు. ముఖ్యంగా దివ్యాంగులకు, నిరుపేదలకు, అగ్నిప్రమాదంలో ఇళ్లుకోల్పోయిన వారికి తనవంతు సాయం అందిస్తూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. సాంబయ్యను వన ప్రేమికుడు, జంతు ప్రేమికుడు అని పిలుస్తారు.

మొక్కలు నాటుతూ.. జంతువులకు ఆహారం అందిస్తూ..

ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలు, చెరువుగట్లు, అడవుల్లో మొక్కలు నాటుతుంటాడు. అడవుల్లో చెట్లు అంతరించిపోవడంతో గ్రామాల్లో కోతులు పెరిగాయని.. కావున అడవుల్లో పండ్ల మొక్కలు నాటుతుండాడు. అంతే కాకుండా రోజు తన ఇంటిపై పక్షులకు మేత వేయడం, కోతులకు ఆహారం అందిస్తూ తన మంచి మనస్తత్వాన్ని నిరూపించాడు. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు ఆయనకు అవార్డులు ఇచ్చి సత్కరించారు.

సాంబయ్య చేసిన సామాజిక సేవలు..

ఛత్తీస్‌ఘడ్ నుంచి వచ్చిన కూలీలకు ప్రయాణం ఖర్చులు, భోజనం ఖర్చులకు రూ.1,000 సాయంగా అందించడం, అనారోగ్యంతో బాధపడుతున్న నిజామాబాద్ జిల్లా అర్గుల్ గ్రామానికి చెందిన బి.సురేష్‌కు రూ.2,500 డీడీ తీసి పంపించాడు. అదేవిధంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఏన్కూరుకు చెందిన బింగి కుమారికి, నాచారంకి చెందిన రేసు కోటేశ్వరరావులకు తలా రూ.వెయ్యి అందించడంతో పాటు మణుగూరుకు చెందిన కుర్రం రవికి రూ.2,500 , గార్లఒడ్డుకు చెందిన దివ్యాంగుడికి రూ.1,200 నగదును సాయంగా అందించాడు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలో వీధిలైట్లు ఏర్పాటు, వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేద్రం ఏర్పాటు చేశాడు. అంగన్‌వాడీలో చిన్నారులకు ప్లేట్లు అందిస్తూ తన సేవా గుణాన్ని చాటుకున్నాడు.

సాధించిన అవార్డులు..

- 2015లో తెలంగాణ ప్రభుత్వం సామాజిక కార్యకర్తగా గుర్తించి రూ.10 వేల నగదు ప్రశంస పత్రం అందజేసింది.
- అబ్దుల్‌కలాం ఎక్సలెన్స్, అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులతో పాటుగా.. 2020లో శ్రీ సుధా సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తన సేవలను మెచ్చి అవార్డు అందించారు.

సాయం చేయడంలోనే ఆనందం..



సాటివారు కష్టాల్లో ఉన్నపుడు వారికి కొంత సాయం చేసినప్పుడు సంతోషంగా ఉంటుంది. ఆశతో కాదు ఆశయంతో జీవించాలి. ధానం చేయని ధనము.. సంస్కారం లేని చదువు వ్యర్థం. జీవితాంతం పదిమందికి సాయం చేయాలన్నది నా సంకల్పం. సాటివారికి సాయం చేస్తు, మొక్కలు, పక్షులు, జంతువులను ప్రేమించాలి.

– కొంటు సాంబయ్య, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, ఏన్కూరు



గుంతలు పడిన రహదారిని పూడ్చుతున్న దృశ్యం

నియామకం..



ఎంపీడీఓ రంజిత్‌కుమార్

ఏన్కూరు: ఏన్కూరు ఎంపీడీఓగా బి.రంజిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జీవీఎస్ నారాయణ డీఎల్‌పీఓగా కల్లూరుకు వెళ్లగా.. వేంసూరులో పనిచేసిన రంజిత్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఓటర్ జాబితా అభ్యంతరాలపై సమావేశం



సత్తుపల్లిరూరల్: ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్

మధిర/ఎర్రుపాలెం/సత్తుపల్లిరూరల్/ కల్లూరు రూరల్/ ఏన్కూరు/ కొణిజర్ల: మధిర, ఎర్రుపాలెం, ఏన్కూరు, కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం వివిధ పార్టీల నేతలతో ఎంపీడీఓలు వెంకటేశ్వరరావు, బి.సురేందర్, జీవీఎస్ నారాయణ, ఆర్.ఉపేంద్రయ్య, డి.చంద్రశేఖర్, చిన్ననాగేశ్వరరావు, ఎంపీఓ జి.శ్రీలక్ష్మి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలను పంచాయతీల వారీగా గ్రామాల్లో ప్రదర్శించామని, రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాను పరిశీలించి అభ్యంతరాలను అందించాలని తెలిపారు. స్థానిక ఎన్నికలకు అందరూ సహకరించాలని, సెప్టెంబర్ 2న తుది జాబితాను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. పలు వార్డుల్లో ఎక్కువ, తక్కువ ఓట్లను, ఒకవార్డుకు చెందిన వారిని మరొక వార్డులో చూపించడం జరిగిందని, వాటన్నింటిని సరిచేయాలన్నారు. కొన్నిచోట్ల ఉన్న డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. బేతుపల్లి పంచాయతీలో ఓటర్ల జాబితాపై అఖిలపక్ష నాయకులు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, పలు రాజకీయ పార్టీల నాయకులు సూరంశెట్టి కిషోర్, మంద సైదులు, ప్రభాకర్, యన్నం శ్రీనివాసరెడ్డి, బొగ్గుల భాస్కర్ రెడ్డి, గోసు రామారావు, నూతక్కి నర్సింహారావు, బెజవాడ రవిబాబు, రహీం, వడ్డె నారాయణరావు, తాతాసుధాకర్‌రావు, కొప్పుల కృష్ణయ్య, గడల భాస్కర్, స్వర్ణ రమేష్, మురళి, శంకర్‌రావు, శివవేణు, జగదీష్, రాజేంద్రప్రసాద్, పాలేపు రామారావు, అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, కృష్ణ, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రామకృష్ణ, కాకర్ల రంగారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్సై రామారావు, డాక్టర్ మురళీ కృష్ణ

వైరా: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృడత్వాన్ని కలగ జేస్తాయని వైరా ఎస్సై పుష్పాల రామారావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ కాపా మురళీ కృష్ణ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైరా ఇండోర్ స్టేడియంలో కోచ్ అంజాద్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ పోటీల్లో గెలుపొందిన వారికి వారు శనివారం బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ప్రతి విద్యార్థి చదువులతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో బొర్రా రాజశేఖర్, సుందర్ రావు ప్రథమ బహుమతి సాధించగా.. 8 ఏళ్ల యోచన్ శ్రీయాన్ అద్భుత ప్రతిభ కనబర్చినట్లు కోచ్ అంజాద్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నందిగామ మనోహర్, కట్ల ప్రియాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

మధిర: వచ్చే నెల13న జరగనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మధిర కోర్ట్ న్యాయమూర్తులు ఎస్.ప్రశాంతి, వేముల దీప్తి కోరారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన మెగాలోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. లోక్ అదాలత్ విజయవంతానికి పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల న్యాయ వివాదాలు త్వరగా పరిష్కారం అయ్యేందుకు మెగా లోక్ అదాలత్ ఒక ప్రధాన వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహాం, సీఐ డి.మధు, టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్సైలు, ఎక్సైజ్ సీఐ సాయిరామ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పుల్లారావు, న్యాయవాదులు వాసంశెట్టి కొటేశ్వరరావు, రామరాజు, మాధురి తేజ, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం కాలనీ సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: రేజర్లలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 20 డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ కోరారు. శనివారం రేజర్ల డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సీపీఎం మండల కమిటీ బృందం పరిశీలించింది. ఇళ్లల్లో కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరాయని, విద్యుత్‌మీటర్లు, తాగునీరు, డ్రెయినేజీలు, రోడ్లు లేకపోవటం వల్ల లబ్ధిదారులు ఈ ఇళ్లల్లో రావడానికి ఆసక్తి చూపించటం లేదన్నారు. కార్యక్రమంలో ననందరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, నాగమణి, రాజమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



మాజీ ఎమ్మెల్యే సండ్రను సత్కరిస్తున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కొత్తూరులో వినాయకుని విగ్రహానికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆలయ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, రాగాల చంద్రారెడ్డి, సత్యావతి, కిన్నెర తిరుపతి, రమేష్‌రెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం, బెల్లంకొండ రాము, మరికంటి శ్రీనివాసరావు, మాధురి మధు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు



తల్లాడ: వరిలో తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కల్లూరురూరల్/తల్లాడ: కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో, తల్లాడ మండలకేంద్రలో భారీ వర్షాలకు ముంపుకు గురైన వరిపొలాలను కల్లూరు, తల్లాడ మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎం.రూప, ఎండి.తాజుద్దీన్, రెవెన్యూ ఆర్ఐ సుజాత శనివారం పరిశీలించారు. ఈ సదర్భంగా కల్లూరులోని పంట నష్టపోయిన బాధిత రైతులు అధికారులకు తమ గోడును వెలబుచ్చారు. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిలో కాండం కుళ్లు తెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లు చెప్పారు. నీటి మట్టానికి ఆనుకున్న పంటకు పైన నల్లటి చారలతో కూడిన మచ్చలు ఏర్పడ్డాయని, దుబ్బులో పిలకలు వాడిపోవడం, పిలకలు కుళ్లిపోయి చనిపోతున్నాయన్నారు. దీని నివారణకు హెక్సాకోనజోల్ 5 ఇసీ లేదా 5ఎస్.సి 2మి.లీ లేదా వాలిడామైసిన్ 2మి.లీ లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ లేదా బెబుకోనజోల్ 1 మి.లీ.. 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిలకల కింది వరకు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుచరితాదేవి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.చైతన్య, టి.పావని, ఫణీశ్రీ , ఏఈఓ త్రివేణి, గ్రామ ప్రముఖులు, విశ్రాంత ఏఎస్సై కె.రామారావు, రైతులు రామకృష్ణ, నాగేశ్వరరావు, మోహన్‌రావు, సత్యనారాయణ, రామారావు, రమేష్‌బాబులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేయించుకోండి

మధిర: ఈనెల 28 నుంచి పంట నమోదు చేయడం జరుగుతుందని ఏఓ కె.సాయి దీక్షిత్ పేర్కొన్నారు. శనివారం మధిర క్లస్టర్ పరిధిలోని పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ సంవత్సరం డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నమోదు చేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు అక్టోబర్ 25 లోగా తమ పంటలు నమోదు చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి

చింతకాని: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పాతర్లపాడులో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు తెలుకున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు యాదగిరి, కృష్ణారావు, వీరబాబు, రమేష్, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

మధిర: మధిర ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు పాపినేని రామనరసయ్య మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని, ఉన్న వైద్యులు సమయానికి రావడంలేదని ఆరోపించారు. మధిరలో రూ.34 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

సేవ చేయడం అభినందనీయం

తల్లాడ: ప్రతీ ఒక్కరు సేవ చేయడం అభినందనీయమని హ్యూమన్ రైట్స్ ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు అన్నారు. శనివారం బిల్లుపాడులో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు తేళ్లూరి చిన్న యేసు కుమార్తె తేజశ్రీ అందించిన సహకారంతో.. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్, తల్లాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నేషనల్ ఉమెన్స్ వింగ్ యనమల రుక్మిణి, నాగమణి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, జయరాజు, అప్పిరెడ్డి, ముస్తఫా, లాజరు, మార్తమ్మ సేవా సంస్థ అధ్యక్షులు శ్రీనివాసరావు, భాను, నరసింహారావు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి..



పెసర పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల: వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శనరావు అన్నారు. శనివారం మండలంలోని చిన్నమునగాలలో ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాల వల్ల పెసర పంట పూర్తిగా తుడిచి పెట్టుకు పోయిందన్నారు. చెట్ల మీదనే కాయలుకు మొలకలు వచ్చి బూజు పట్టి పోయాయన్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి అయితే అగమ్యగోచరంగా తయారైందన్నారు. సరిపడా యూరియా అందించాలన్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు చలపతిరావు, నరసింహారావు, కృష్ణ, పురుషోత్తం ,కరుణాకర్, నరసింహారావు, రాజేష్, మురళి, నాగయ్య, ప్రసాద్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు తెలిపారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధార్నను విజయవంతం చేయాలని కోరుతూ.. శనివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ర్యాలీలో వారు మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా నూతన పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిందని, ఇది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో మధిర, ఎర్రుపాలెం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, మదన్మోహన్ రెడ్డి, ఎం.బాబురావు, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, షేక్ మదార్, తూమాటి కృష్ణారెడ్డి, జిల్లా బాధ్యులు సీహెచ్ రవికుమార్, శ్రీనివాసరావు, సంగిరెడ్డి, నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తల్లాడ: తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేజీ షో, మ్యాజిక్ షో ద్వారా కళాబృందం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బారిన పడే ముందు కస్టమర్లు ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఫణికుమార్, బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంకు చెందిన రైతు బాణాల చక్రపాణి ఇటీవల మృతి చెందడంతో ముదిగొండ సొసైటీలో కార్యాలయంలో శనివారం చైర్మన్ తుపాకుల యలగొండస్వామి రైతు భార్యకు రూ.50వేల చెక్కు అందజేశారు. వైస్ చైర్మన్ బట్టు పురుషోత్తం, సీఈఓ వెంకటరత్నం, కార్యాలయ సిబ్బంది ఎస్కె జానిమియా, బాషా, మరింకటి సతీష్, ప్రసాద్, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గణేష్ మండపంలో అన్నదానం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రేచర్ల బజార్‌లో సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు మాజీ మున్సిపల్ వైస్ యూర్మన్ సీతారాములు తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు.

రింగ్‌సెంటర్‌లో..

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రింగ్‌సెంటర్‌లో శనివారం వినాయకుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు శ్రీస్వామివారిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు.

ఘనంగా నిమజ్జనం..

మధిర: మధిర పట్టణంలోని టీచర్స్ కాలనీలో వరసిద్ధి వినాయక టీచర్స్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహాన్ని శనివారం మధిర పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ముందుగా పలువురు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనిధి విద్యాసంస్థల చైర్మన్ అనిల్ కుమార్ నెహ్రూ, కనకతార దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అసోసియేషన్ నిర్వాహకులు ప్రారంభించారు.

ఆర్టీసీ గణపయ్యకు 35 ఏళ్లు..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ గణపయ్యకు 35 ఏళ్లు నిండాయి. ఆర్టీసీ డిపోలో కార్మికులు, ఉద్యోగులు గత 34 ఏళ్లుగా ప్రతి ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తున్నారు.

వృద్ధురాలి ఇంట్లోకి వరదనీరు

మధిర: భారీ వర్షాలకు వృద్ధురాలి ఇంట్లోకి వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఘటన మండల పరిధిలోని రొంపిమల్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూము పాటి గోవిందమ్మ అనే ఒంటరి వృద్ధురాలు ఇంట్లోకి భారీగా వరద నీరు చేరింది. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు తదితర సామాగ్రి నీటిలో మునిగిపోయాయి. ఆశ్రయం ఇచ్చేవారు లేక నీళ్లు ఉన్న ఇంటిలోనే అనేక ఇబ్బందులు పడుతున్నానని ఆమె వాపోతోంది. ప్రభుత్వ అధికారులు తన దుస్థితిని పరిశీలించి ఆదుకోవాలని గోవిందమ్మ వేడుకుంటుంది.

మెడిసిన్ విద్యార్థినికి సత్కారం



మెడిసిన్ విద్యార్థి మాధురిని సత్కరిస్తున్న ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. డిపోకు చెందిన సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వింజమూరి ప్రభాకర్, కవిత దంపతుల కుమార్తె మాధురి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా శనివారం డిపోలో జరిగిన కార్యక్రమంలో మెడిసిన్ విద్యార్థి మాధురిని డీఎం, ఎంఎఫ్‌లు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఎంఎఫ్ సిలివేరు సాహితీ, డీఐ ప్రభాకర్, వీబీఓ ఆనంద్ పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

కొణిజర్ల: బలరామ జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని తనికెళ్లలో 65ఏండ్లు పైబడ్డ రైతులను సత్కరించారు. అఖిల భారతీయ రోజ్‌గార్ ఉపాధి కల్పన ప్రముఖ్ జలగం కుమారస్వామి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రైతులంతా సంఘటితం అయినప్పుడే రైతులకు మద్దతు లభిస్తుందన్నారు. రైతును ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కవిడ మురళి, సోమదరియాసింగ్, మందడపు రామారావు, బండారు సత్యనారాయణ, కొండపర్తి నరేష్, యాసా సత్యనారాయణ, కవిడ రాంబాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిస్ట్ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరులో గల మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి ఏడాది ఈసీఈ, ఈఈఈ విద్యార్థులు శనివారం ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీని)ని ఉపయోగించుకొని నిత్య జీవితంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా రకాలైన నమూనాలను రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

మహిళకు ఉపాధి.. రైతులకు భరోసా

వైరా: మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడి సంపాదించుకునేలా వారికి వసతులు కలిపిస్తే తప్పక అభివృద్ధిలోకి వస్తారని పర్బుల్ డీఎస్ఏ సొసైటీ అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వైరాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వైరాకు చెందిన ముగ్గురు మహిళలకు కట్టుమిషన్లు, వీధి వ్యాపారం చేసుకునే మహిళకు తోపుడు బండి, మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ నిరుపేద రైతుకు పవర్ స్ప్రేయర్ వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పర్బుల్ డీఎస్ఏ ఉపాధ్యక్షుడు బద్రీనారాయణ, కార్యదర్శి కవితా రాణి, కోఆర్డినేటర్ పి.ఉపేందర్ రావు, సభ్యులు మిట్టపల్లి భాస్కరరావు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాలికలకు జ్వరాలు సోకుతున్నందున.. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు బాలికలందరికీ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రాములు, ప్రత్యేకాధికారి లావణ్య పాల్గొన్నారు.